నాడు కళకళ నేడు వెలవెల



భజన కార్యక్రమంలో పాల్గొన్న బృందం





భజన అనే మూడక్షరాల పదానికి అనేక అర్థాలున్నాయి. భగవానుడి సేవ, స్తుతి అని మూలభావం. ధీరత్వం అనే అర్థమూ ఉంది. నిజమే మరి. ఊరూ వాడా కలిసి చేసే భక్తి భజనలు ఎంతో కనువిందు, వీనులకూ పసందు. 'శ్రీరామ నీ నామమెంతో రుచిరా.. కదళీ ఖర్జూరాది ఫలములకన్న, నవరస పరమాన్న నవనీతములకన్న ఎంతో రుచిరా' - అంటూ భక్త జనులంతా రాగ తాళ భరితంగా, లయబద్ధంగా భజిస్తుంటే ఆ పరిసరాలంతటా భక్తి తరంగాలు వ్యాపిస్తాయి. ఒకప్పుడు ఏ పల్లెటూరులోనైనా ఓ భజన మందిరం తప్పక ఉండేది. మధ్యలో ఏ కాస్త విరామం దొరికినా పెద్దలూ పిన్నలూ అక్కడే చేరేవారు. తాళాలూ, చిడతల శబ్ద మాధుర్యంతో చుట్టుపక్కల పవిత్ర వాతావరణం నెలకొనేది. స్తుతులు, శ్లోకాలు, పాటలు, పద్యాలు, సామెతలు, జాతీయాలు, పద చమత్కారాలు- ఒకటా రెండా.. అనేకం. వాటిల్లోనూ పోటాపోటీ. పలు విధాలుగా వర్ణించడం, చింతనతో వేడుకోవడం, దైవాన్ని సూటిగా ప్రశ్నించడం, కష్టనష్టాలు చెప్పుకోవడం, ఆ భజనల్లోనే ఒక్కోసారి నిందా స్తుతి సాగించడం.. లెక్కలేనన్ని భక్తి మార్గాలుగా కీర్తింపబడ్డాయి. ప్రస్తుతం ఈ బైటో భజనకు గ్రామాల్లో ఆదరణ తగ్గుతోంది.

- తగరపువలస

నాడు భజనకు బ్రహ్మరథం ● నేడు ఆదరణ కరవు

శివరాత్రి, ఆలయ వార్షికోత్సవాలు, ప్రారంభోత్సవాలు, చనిపోయిన వారి ఇంట బంధువులు రాత్రంతా మేలుకోవడానికి ఈ బైటో భజన కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇటీవల ఈ బైటో భజన కార్యక్రమాలకు ఆదరణ తగ్గిపోయింది. ఇందులో ముఖ్యంగా పాటల రచయిత, గాయకుడు, హార్మోనియం, డోలక్ కళాకారులకు ప్రాధాన్యత ఉంటుంది. వీరంతా కలిపి 8 మంది ట్రూప్‌గా వ్యవహరిస్తారు. స్థానికులు వీరితో కలిసి భజనా కార్యక్రమాలలో పాల్గొంటారు. భజనలకు ఆదరణ తగ్గినా పౌరాణిక నాటకాలు, ఊరేగింపు, పల్లకిసేవ, నృత్య ప్రదర్శనలు జరిగినప్పుడు మాత్రం హార్మోనియం, డోలక్ కళాకారులకు పిలుపు వస్తుంది. సమయాన్ని బట్టి పాడే పాటకు అనుగుణంగా కళాకారులు డోలక్, హార్మోనియం వాయిద్యాలు మరో లోకానికి తీసుకువెళ్లి తన్మయుల్ని చేస్తారు.

కాలక్షేపానికి నేర్చుకున్నవారే కళాకారులయ్యారు..

ప్రస్తుతం కొత్తగా ఎవరూ బైటో భజన నేర్చుకోవడానికి ఆసక్తి చూపకపోయినప్పటికీ గతంలో కాలక్షేపానికి నేర్చుకున్నవారే ప్రస్తుతం కళాకారులయ్యారు. ఆ కళే వారికి ఉపాధి చూపుతోంది. 25 ఏళ్ల క్రితం భీమిలి చుట్టుపక్కల ప్రాంతాలలో సంతపేట, తగరపువలస, భీమిలి చిల్లపేట, మూలకుద్దు, చెరకుపల్లి, మజ్జివలస, అమనాం, గుడివాడ, చిప్పాడ, పాతపాలెం, శ్రీరామనగర్ తదితర గ్రామాలలో బైటోభజన కార్యక్రమాలు బాగా సాగేవి. గణపతి, దుర్గా నవరాత్రులు, గ్రామదేవతల పండగలతో పాటు నిత్యం రామాలయాలలో భజనలు జరుగుతుండేవి. ఈ బృందాలకు గురువులు ఉండేవారు. ఇప్పటికి కూడా కొన్ని గంటలు, రోజుల పాటు సాగే సప్తాహం పేరుతో జరిగే భజనా కార్యక్రమాలకు ఉత్తరాంధ్ర నుంచి బృందాలను సేకరిస్తుంటారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో నిర్వాహకులు దారి, భోజన ఖర్చులు చెల్లిస్తారు. చనిపోయిన వారింట మాత్రం హార్మోనియం, డోలక్ కళాకారులకు రూ.1500, గాయకులు, ఇతరులకు రూ.1000 వంతున గౌరవ వేతనం చెల్లిస్తారు. ఒక్కో భజన ట్రూప్‌లో కనీసం 8 మంది ఉంటారు.



భీమిలి మండలంలో భజన బృందాల సభ్యులు

కొత్తగా ఎవరూ నేర్చుకోవడం లేదు..



కొత్తగా హార్మోనియం, డోలక్‌లు ఎవరూ నేర్చుకోవడం లేదు. ప్రస్తుతం అన్నిచోట్లా రెడీమేడ్ ట్రాక్‌లు అందుబాటులో ఉంటున్నాయి. సాధారణ వాయిద్యాలకు ప్రత్యామ్నాయంగా ఎలక్ట్రానిక్ పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. అయినప్పటికీ మేము విని యోగించే సాధనాలు మంచి అనుభూతి కల్పిస్తాయి.

–రవ్వ ఆనంద్, డోలక్ కళాకారుడు

మాకు మేమే గౌరవించుకుంటాం



ప్రస్తుతం భజన సారం తెలియని వాళ్లు ఎక్కువగా ఉన్నారు. తప్పనిసరి మేము ఎక్కడైనా ప్రోగ్రాం కోసం వెళ్తే అక్కడి భజన కళాకారులు మమ్మల్ని.. అలాగే మేము పరస్పరం గౌరవించుకుంటాం. మీరాబాయి, ఎంఎస్. సుబ్బులక్ష్మి వంటి వారు మాకు ఆదర్శం.

–రవ్వ అప్పలనరసయ్య, డోలక్ కళాకారుడు

భృతి కల్పిస్తుంది



మా నాన్న ప్రకాశరావు ప్రముఖ హార్మోనియం కళాకారుడు. అతని నుంచి నాకు ఈ కళ అబ్బింది. హార్మోనియం, డోలక్ వంటి సాధనాలు ఖరీదైపోయాయి. వీటికి రిపేరు కూడా కష్టమే. విజయనగరం, శ్రీకాకుళం తీసుకువెళ్లాలి. ఒక్కొక్కటి రూ. 16వేల పై మాటే. తాళాల జత రూ.150 నుంచి రూ.300 వరకు దొరుకుతాయి. అప్పుడప్పుడు నాలాంటి వారికి ఆ భజనా కార్యక్రమాలు భృతి కల్పిస్తున్నాయి.

–ఊడికల చిరంజీవి, హార్మోనియం కళాకారుడు

నిత్యం పాటలు మారుస్తూ ఉండాలి..



భజన చేయవలసిన సందర్భంగా బట్టి సినిమా, దేవుళ్ల పాటలను నిత్యం మారుస్తూ కొత్తగా రాస్తుంటాం. ఒక్కోసారి అవసరాన్ని బట్టి పేర్లు మార్చి పాడుతుంటాం. ప్రస్తుత తరానికి భజన విలువ తెలియకపోయినా పాత తరానికి తెలుసు. క్రమంగా భజనకు ఆదరణ తగ్గిపోతోంది.

–చిల్ల సూరిబాబు, రచయిత, గాయకుడు

అమృతం పోసినట్టు ఉంటుంది



భజనలు ఆలపించినా, ఆలకించినా చెవుల్లో అమృతం పోసినట్టు ఉంటుంది. అందుకే ఎక్కడ భజనలు జరిగినా వెళ్లి వారితో తాళం కలుపుతాను. ఇది నాకు దినచర్యగా మారిపోయింది. ప్రస్తుతం ఉద్యోగ విరమణ చేయడం వలన ఎక్కువ ఖాళీ దొరికింది.

–నామాల తిరుపతిరావు, విశ్రాంత విద్యుత్ ఉద్యోగి

క్లుప్తంగా

అగ్నిమాపక శకటం మరమ్మతులకు ఆర్థిక సాయం



చిట్టివలస అగ్నిమాపక శాఖాధికారికి చెక్కు అందిస్తున్న దివీస్ జీఎం కోటేశ్వరరావు

తగరపువలస: చిట్టివలస అగ్నిమాపక కేంద్రంలోని వాహన మరమ్మతుల నిమిత్తం భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబరేటరీ యాజమాన్యం గురువారం రూ.65వేలు అందించింది. సంస్థ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో దివీస్ జనరల మేనేజర్ వైఎస్ కోటేశ్వరరావు చెక్కును అగ్నిమాపక శాఖాధికారి జి.శ్రీనివాస రాజుకు అందించారు. కార్యక్రమంలో సేఫ్టీ అధికారి ఎం.చంద్రశేఖర్, సీఎస్సార్ ప్రతినిధి ఎ.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాలాలయంలో హుండీ చోరీ

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ సత్తమ్మతల్లి బాలాలయంలో బుధవారం రాత్రి హుండీ చోరీకి గురైంది. ఇటీవల ఆలయ పునర్నిర్మాణ కార్యక్రమంలో పాత ఆలయాన్ని తొలగించి పక్కనే బాలాలయం నిర్మించి పూజలు చేస్తున్నారు. ఇక్కడ ప్రతి బుధవారం హుండీ ఆదాయాన్ని లెక్కిస్తారు. అయితే ఈ బుధవారం హుండీలు తెరవకుండా వదిలేశారు. దీనిని గమనించిన దొంగలు హుండీలోని మొత్తాన్ని కొల్లగొట్టారు.

పాత సామియ్యవలసలో తాగునీటి సమస్య

తగరపువలస: పద్మనాభం మండలం పాండ్రంగి పంచాయతీ పాత సామియ్యవలస ప్రజలను మూడు రోజులుగా తాగునీటి సమస్య వేధిస్తోంది. పంప్‌హౌస్‌కు ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ బాక్సు కాలిపోవడంతో ఈ సమస్య తలెత్తిందని గ్రామానికి చెందిన రైతు గోవిందరావు పేర్కొన్నాడు. గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు సకాలంలో స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఉపాధి హామీ పనుల్లో అవకతవకలపై విచారణ

తగరపువలస: ఆనందపురం మండలం శొంఠ్యాం పంచాయతీలో జరిగిన ఉపాధి హామీ పనులలో అవకతవకలు జరిగాయి. దీనిపై గురువారం అధికారులు విచారణ చేపట్టారు. విచారణకు దిగువ స్థాయి సిబ్బంది సహకరించకపోవడంతో స్థానికులు గొడవ చేశారు. పంచాయతీలో జరిగిన అవినీతిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని పంచాయతీ వాసులు డిమాండ్ చేశారు.

వ్యక్తి అదృశ్యం



చంద్ర శేఖర్ (ఫైల్)

కొమ్మాది: మధురవాడ మిథిలాపూరి వుడా కాలనీకి చెందిన ఓ వ్యక్తి అదృశ్యమైనట్లు పీఎంపాలెం పోలీస్‌స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలు ప్రకారం మిథిలాపూరి వుడా కాలనీలో నివాసం ఉంటున్న కొంచ చంద్రశేఖర్ (24) ఉప్పాడ ఐఎస్ఎస్ కళింగ వద్ద ఓ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. ఇదిలా ఉండగా బుధవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయాడని, ఫోన్ చేస్తే స్విచ్‌ఆఫ్ వస్తుందని బంధువు నళిని రత్న సాయి తెలిపారు. గురువారం కూడా ఇంటికి రాకపోవడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది.

దొరతోట రోడ్డును వంద అడుగులు దాటి విస్తరించవద్దు



బొడ్డపాలెం వద్ద ఆందోళన చేస్తున్న స్థానికులతో సీఐటీయూ నాయకులు

తగరపువలస: ఆనందపురం మండలం భీమిలి క్రాస్‌రోడ్డు నుంచి భీమిలి వెళ్లే దొరతోట రోడ్డును వంద అడుగుల మించి విస్తరించవద్దని స్థానికులు గురువారం సీఐటీయూ నాయకులతో కలిసి ఆందోళన చేపట్టారు. ఇటీవల వీఎంఆర్డీఏ ఈ రహదారిని 200 అడుగుల మేరకు విస్తరించనున్నట్లు రహదారికి ఇరువైపులా ఉన్నవారికి నోటీసులు జారీ చేసిందని జీవీఎంసీ 78వ డివిజన్ కార్పొరేటర్ గంగారావు అన్నారు. గతంలో వీఎంఆర్డీఏ అధికారులు రోడ్లను అభివృద్ధి చేస్తామని, వెడల్పు చేయబోమని హామీ ఇచ్చారన్నారు. ప్రస్తుతం భీమిలి క్రాస్‌రోడ్డు నుంచి బోడ్డపాలెం, మన్యాలపేట, గొల్లలపేట తదితర గ్రామాలలో రహదారికి ఇరువైపులా 500 కుటుంబాల వారు చిరు వ్యాపారాలు సాగిస్తూ జీవనం సాగిస్తున్నారన్నారు. ప్రజలు, రైతులు వినతులను దృష్టితో ఉంచుకుని రహదారిని వంద అడుగుల కంటే ఎక్కువ విస్తరించవద్దన్నారు.

కేజీబీవీని సందర్శించిన దేవానందరెడ్డి



విద్యార్థినులను కలిసి భోజనం చేస్తున్న దేవానందరెడ్డి

భీమునిపట్నం: భీమిలిలోని కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని గురువారం కేజీబీవీ సెక్రటరీ డీ.దేవాందరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థినులు ఎలా చదువుతున్నారో పరిశీలించారు. పరీక్షలు బాగా రాయాలని సూచించారు. తొమ్మిదో తరగతి విద్యార్థినులకు అందిస్తున్న బ్రిడ్జ్ కోర్సు ఎలా జరుగుతోంది పరిశీలించారు. ఏడో తరగతి విద్యార్థినులకు గణితం, ఆంగ్లం, తెలుగులో డిక్టేషన్ నిర్వహించారు. అనంతం పిల్లలతో కలిసి భోజనం చేశారు. ప్రిన్సిపాల్ గంగాకుమారి, సిబ్బంది పాల్గొన్నారు. పిల్లలకు బోధించే పాఠ్యాంశాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కేజీబీవీ సెక్రటరీ దేవానందరెడ్డి అన్నారు. గురువారం భీమిలిలోని జిల్లా విద్యాశిక్షణ సంస్థ (డైట్) వద్ద ఛాత్రోపాధ్యాయులతో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు పలు సూచనలు, మెళకువలను తెలిపారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్, అధ్యాపకులు జీజీఎస్.నాగేశ్వరరావు, సోమయాజులు, త్రినాథరావు, హరిణి, నీలిమ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ఆందోళనకు తరలిన నేతలు



పీఎం పాలెం వద్ద నిరసన కార్యక్రమంలో ఆనందపురం వైఎస్సార్‌సీపీ నాయకులు



ఆందోళనలో పాల్గొన్న భీమిలి నాయకులు

తగరపువలస: పీఎంపాలెంలోని ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియానికి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పేరు తొలగించిన నేపథ్యంలో గురువారం వైఎస్సార్‌సీపీ చేపట్టిన నిరసన కార్యక్రమంలో భీమిలి, ఆనందపురం మండలాల నుంచి పలువురు నాయకులు భారీగా తరలివెళ్లారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న దురాగతాలపై మండిపడ్డారు. ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని వారి మిడిసిపాటుకు ప్రజల నుంచి పరాభవం తప్పదని హెచ్చరించారు.

శిల్పారామాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దండి



శిల్పారామంలో పర్యటిస్తున్న స్పెషల్ ఆఫీసర్ స్వామి నాయుడు

పీఎంపాలెం: శిల్పారామంలో పచ్చదనం మరింత పెంపొందించడానికి అవసరమైన చర్యలు చేపట్టామని రాష్ట్ర శిల్పారామాల ప్రత్యేక అధికారి స్వామినాయుడు అన్నారు. గురువారం స్థానిక శిల్పారామాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా స్వామినాయుడు మాట్లాడుతూ సందర్శకులను ఆకర్షించడానికి నిరంతరం కృషి చేయాలని ఆదేశించారు. స్థానికంగా నెలకొల్పిన శిల్పాలను, ఆట వస్తువులను, ఎల్లప్పుడూ తాజాగా ఉండడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఏవో విశ్వనాథరెడ్డిని ఆదేశించారు. ఇప్పుడున్న మొక్కలను సంరక్షిస్తూనే మరిన్ని మొక్కలు నాటాలన్నారు.

అవగాహన కల్పించిన టెక్నో కల్చరల్ మీట్



ప్రసంగిస్తున్న జీవీఎంసీ ఈఈ శాంతిరాజ్

పీఎం పాలెం: విద్యార్థులు చదువుతో పాటు తన చుట్టూ జరుగుతున్న స్థితి గతులపై కూడా మెరుగైన అవగాహన ఉండాలని జీవీఎంసీ మధురవాడ జోన్ ఈఈ కే. శాంతిరాజ్ అన్నారు. గురువారం పీఎంపాలెం బాబా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ కళాశాలలో జరగిన టెక్నో కల్చరల్ కార్య క్రమంలో ప్రసంగించారు. విశాఖ నగరం 640 చదరపు కిలో మీటర్ల విస్తీర్ణంలో 23 లక్షల జనాభా ఉండగా.. దాపుగా అంతే విస్తీర్ణంలో ఉన్న హైదరాబాద్ కోటికి పైగా జనాభా ఉండడం విశేషమన్నారు. భారీ సివిల్ ప్రాజెక్టులు వాటి నిర్మాణ తీరును క్రియేటివ్ కనస్ట్రక్షన్స్ ఎండీ ముని శ్రీనివాసరావు వివరించారు. కళాశాల కస్పాండెంట్ అండ్ సెక్రటరీ కె.శ్రీలక్ష్మి మాట్లాడారు. ఈ నెల 22వ తేదీన జరిగే అంతర్జాతీయ నీటి దినోత్సవం నేపథ్యంలో సివిల్ నిర్మాణాలు కట్టడాలు గురించి వివరించారు.

మహిళపై ఆకతాయి దాడి

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లు రోడ్డులో గురువారం రాత్రి 10.30 సమయంలో ఒక ఆకతాయి, మహిళ పట్ల దురుసుగా ప్రవర్తించాడు. బస్సు దిగి చిట్టివలస వైపు వెళ్తున్న ఆమెను ద్విచక్రవాహనంపై వెనుక నుంచి వచ్చిన ఆకతాయి వీపుగా గట్టిగా బాది వెళ్లిపోయాడు. దీంతో ఆమె బిత్తరపోయి పరుగులు తీసింది. ఆ ప్రాంతంలో వీధిదీపాలు లేకపోవడంతో ఆకతాయిని గుర్తించలేకపోయింది. కొంత కాలంగా చిట్టివలస పెట్రోల్ బంకు నుంచి సీఐటీయూ కార్యాలయం వరకు వీధిదీపాలు వెలగకపోవడంతో ఈ ప్రాంతంలో ఆకతాయిల ఆగడాలు ఎక్కువయ్యాయి.

పేదలపై నిర్లక్ష్యం తగదు



స్థానికులతో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్

కొమ్మాది: జీవీఎంసీ 6వ వార్డు కొమ్మాది దేవి మెట్ట ప్రాంతంలో 30 సంవత్సరాలుగా నివాసం ఉంటున్న దళితులు పేదల పట్ల ప్రభుత్వానికి నిర్లక్ష్యం తగదని సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ అన్నారు. సీపీఎం నిర్వహిస్తున్న ప్రజా చైతన్య యాత్రలో భాగంగా గురువారం ఈ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో దళితులు నివాసం ఉంటున్న కనీసం మౌలిక సౌకర్యాలు కల్పించడం లేదని దీంతో మహిళలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు డి. అప్పలరాజు, ఎస్ పైడితల్లి, తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడి తగ్గించాలని పంచాయతీ కార్యదర్శుల వినతి



వినతిపత్రం అందిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

తగరపువలస: పని ఒత్తిడి తగ్గించాలని కోరుతూ గురువారం ఆనందపురం మండలంలోని వివిధ పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీవో జానకికి వినతి పత్రం అందించారు. వివిధ రకాల సర్వేలు, పంచాయతీలలో నిర్వహించాల్సిన దైనందిక సేవలు కలిపి 40 వరకు ఉన్నాయన్నారు. దీంతో మానసికంగా ఒత్తిడి పెరిగి అనారోగ్యాలకు గురవుతున్నామన్నారు. ఈ నెల 31తో ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున పనుల ఒత్తిడి నుంచి వెసులుబాటు కల్పించేలా ప్రభుత్వానికి నివేదిక పంపించాలని కోరారు.

పెద్దమనసు చాటుకున్నారు



మృతుడి భార్యకు డిపాజిట్ పత్రాలను అందజేస్తున్న కాలనీ వాసులు

మధురవాడ: తమ అపార్ట్‌మెంట్‌లో అంకితభావంతో పనిచేసి ఇటీవల రోడ్డుప్రమాదంలో మృతి చెందిన వాచ్‌మన్‌కు కుటుంబానికి కాలనీవాసులు గురువారం ఆర్థికసాయాన్ని అందించారు. మధురవాడ హరిత అపార్ట్‌మెంట్ వద్ద 2015–18 వరకు చింతాడ రవి వాచ్‌మన్‌గా పని చేశాడు, గత నెలలో రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. దీంతో కాలనీ వాసులు 70 మంది డాక్టర్ కె.సత్యనారాయణ రెడ్డి సారథ్యంలో రూ 1,05,400ను మృతుని భార్య పోలమ్మ పేరుమీద ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి ఆ పత్రాలను ఆమెకు అందించారు. జ్యోతి, సుజాత, దంతేశ్వరరావు, గోవిందరావు పాల్గొన్నారు.

పౌష్టికాహార లోపాలు గల పిల్లలను గుర్తించాలి



శిక్షణ ఇస్తున్న సూపర్ వైజర్లు

పద్మనాభం: పౌష్టికాహార లోపాలతో బాధపడుతున్న పిల్లలను గుర్తించాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్లు ఉమా జానకి , రాజ్యలక్ష్మి అన్నారు. పద్మనాభంలోని వెలుగు కార్యాలయంలో అంగన్వాడీ కార్యకర్తలకు పోషించు చదివించుపై మూడు రోజుల నిర్వహించనున్న శిక్షణ తరగతులు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడారు.ఆరేళ్లలోపు పిల్లలు పౌష్టికాహార లోపంతో బాధపడకుండా నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ఇటువంటి పిల్లలకు పౌష్టికాహారం ఇచ్చేటట్టు పిల్లల తల్లులకు తెలియజేయాలన్నారు.

పౌష్టికాహారంపై శ్రద్ధ చూపాలి

భీమునిపట్నం: చిన్న పిల్లలకు పౌష్టిక ఆహారాన్ని అందించే విషయంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ప్రమీల, అనిత అన్నారు. గురువారం భీమిలి జోన్ పరిధిలోని నాలుగు వార్డులకు సంబంధించిన అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న మూడురోజుల పోషన్ బీ పడాయి బీ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. చిన్న పిల్లలు ఆరోగ్యంతో ఎదగాలంటే చక్కని పౌష్టికాహారాన్ని అందివ్వాలన్నారు.

మెరుగైన పోషణ, విద్య

తగరపువలస: అంగన్‌వాడీల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు మెరుగైన పోషణ, విద్యార్థులకు విద్య అందించడమే లక్ష్యమని ఐసీడీఎస్ ఆనందపురం మండల సూపర్‌వైజర్లు పీవీవీ రత్నం, రేఖావాణి అన్నారు. గురువారం మండలంలో అంగన్‌వాడీలలకు పోషణ్‌భీ, పడాయిభీ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. 0–6 వయసు గల చిన్నారులకు అందించకలిగే పౌష్టికాహారం, విద్య గురించి వివరించారు. మూడు రోజుల పాటు జరుగనున్న ఈ శిక్షణ కార్యక్రమంలో భాగంగా పౌష్టికాహార లోపం కారణంగా చిన్నారులలో వచ్చే వ్యాధుల గురించి అవగాహన కల్పించనున్నారు.

ఆక్రమణదారులపై ఫిర్యాదు చేస్తా



మాట్లాడుతున్న అప్పయ్యమ్మ

తగరపువలస: తన జిరాయితీ స్థలాన్ని కబ్జా చేయడానికి కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు వలందపేటకు చెందిన తోణంగి అప్పయ్యమ్మ ఆరోపించింది. గురువారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. సంగివలస సర్వే నంబర్ 25/6లో తనకు 35 సెంట్లు స్థలం ఉందన్నారు. దుర్గాలమ్మ ఆలయానికి వెళ్లే భక్తుల కోసం తాను 10 అడుగుల వెడల్పు గల స్థలాన్ని గతంలో విడిచిపెట్టానన్నారు. కానీ రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమ వ్యాపారం కోసం నా మొత్తం స్థలాన్ని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. వలందపేటకు చెందిన గంగాధర్ అనే వ్యక్తి వీఆర్వోతో లాలూచీ పడి తన స్థలంలో ఫెన్సింగ్ పోల్స్ ధ్వంసం చేసి గ్రావెల్‌ను ఎత్తుకుపోయారన్నారు. వెంటనే తాను 100 నంబరు ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేశానన్నారు. స్థలం కబ్జా చేయాలనుకునేవారిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కొమ్ము కాస్తున్న వీఆర్వోపై రెవెన్యూ అధికారులు, పోలీసులు చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

పిచ్చుకలను కాపాడుకోవాలి



ప్లకార్డులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు



పిచ్చుకలు వల్ల కలిగే ఉపయోగాలను విద్యార్థులకు వివరిస్తున్న ఉపాధ్యాయులు

మధురవాడ: మానవ మనుగడలో పిచ్చుకల పాత్ర ఎంతో ఉందని అటువంటివాటిని కాపాడుకోవలసిన బాధ్యత అందరికీ ఉందని చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గొట్టేటి రవి అన్నారు. గురువారం పాఠశాల వద్ద నిర్వహించిన ప్రపంచ పిచ్చుకల దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. పర్యావరణంలో కలుగుతున్న మార్పులవల్ల ఇవి అంతరించి పోతున్నాయన్నారు. వీటిని పరిరక్షించుకోవాలని ఇందుకోసం మన ఇళ్లలో పిచ్చుకలు గూళ్లు కట్టుకునే అవకాశాన్ని కల్పించాలన్నారు. ఉపాధ్యాయులు మోహనరావు, మధుసూధనరావు, మహేష్ పాల్గొన్నారు.

పిచ్చుకలు, కప్పలు రైతులకు మిత్రులు

తగరపువలస: పిచ్చుకలు, కప్పలు రైతులకు కలిగించే ప్రయోజనాల గురించి గురువారం జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటోవార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు విద్యార్థులకు వివరించారు. పిచ్చుకలు, కప్పల దినోత్సవం సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణలో వీటి పాత్ర గురించి వివరించారు. కాలుష్యం, సెల్ ఫోన్ వాడకం కారణంగా వీటి ఉనికికి ప్రమాదం వచ్చిందన్నారు. వీటి రక్షణకు తీసుకోవలసి జాగ్రత్తలు గురించి విద్యార్థులకు వివరించారు.

నేడు ఉచిత ధ్యానోత్సవ శిక్షణ ప్రారంభం

భీమునిపట్నం: భీమిలిలో శుక్రవారం హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ, శ్రీరామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో ఉచిత ధ్యానోత్సవ శిక్షణ ప్రారంభిస్తున్నట్టు నిర్వాహకులు జి.సురేష్, ఎం.వి.రావు గురువారం తెలిపారు. ధ్యానం వల్ల కలిగే ప్రయోజనాలు వివరిస్తామన్నారు. భీమిలిలోని జగన్నాథస్వామివారి ఆలయం వద్దనున్న ఇంద్రజుమ్మ మందిరంలో సాయంత్రం 5.30గంటల నుంచి 7 వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు.